సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 35 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం | 17.05.2025

జనగామ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు సివిల్ సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా మారుతున్నాయా..? సివిల్ కేసులు, భూ తగాదాలు ఇక్కడ పరిష్కారించబడవు అంటూ స్టేషన్ బయట బోర్డులు పెడుతూనే.. వెనుక నుంచి సెటిల్‌మెంట్ల పర్వానికి దారులు తేరిచే ఉండును.. అంటున్నారా.. ? అంటే అవును అనే సమాధానం వస్తోంది. ఇటీవల కాలంగా జిల్లాలోని పలు ఠాణాల్లో ఈ దందాలు మరింత పెరిగి పోయినట్టు తెలుస్తోంది. మధ్యవర్తులను పెట్టుకుని 'మనీ' తరలిస్తూ.. కాసులు పండించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి





# ఠాణాల్లో సివిల్ సెటిల్‌మెంట్లు

## భూ తగాదాలతో ఖాకీలకు కాసుల పంట

- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- మధ్యవర్తులను పెట్టుకుని 'మనీ' తరలింపు
- రాజకీయ నేతలు, కొందరు జర్నలిస్టుల కీ రోల్..!

**వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో** ఉండే జనగామ జిల్లా వెస్ట్ జోన్ పరిధిలోకి వస్తుంది. ఈ వెస్ట్ జోన్‌లో స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, జనగామ ఏసీపీ సర్కిళ్లు ఉన్నాయి. ఇందులో నర్మెట్ట, రఘునాథపల్లి (జనగామ రూరల్), జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌తో కలిపి ఐదు సీఐ సర్కిళ్లు, 12 మండలాల్లో పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అయితే ఠాణాల్లో సివిల్ పంచాయితీలు, భూ తగాదాల పరిష్కారాలు పోలీసులు నిర్వహించకూడదనే నిబంధనలు ఉన్నా ఆయా సర్కిళ్ల బాసులు అవేమీ పట్టించుకోకుండా సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జనగామ డీసీసీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఓ ఠాణాలో ఒక భూ సెటిల్‌మెంట్ కోసం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆ భూ తగాదాలో అసలైన బాధితుడిని కాదని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికి పోలీసులు వత్తాసు పలికినట్టు సమాచారం. ఇందు కోసం ఆ వ్యక్తి నుంచి దాదాపు రూ.1లక్ష తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలోనూ ఇదే పీఎస్‌పై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లా స్థాయి నేత తీవ్ర ఆరోపణలు చేశాడు. పోలీసులు లంచాలు తీసుకుని బాధితుల పక్షాన కాకుండా భూ ఆక్రమణ దారులకు వత్తాసు పలుకుతున్నారంటూ మండిపడ్డారు. ఆ విషయంపై సీపీకి సైతం ఫిర్యాదు చేశాడు.

### అంతా మధ్య వర్తులతోనే...

జనగామ డీసీపీ పరిధిలోని కొన్ని సర్కిళ్ల పోలీస్ స్టేషన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సివిల్, భూ సమస్యలు, ప్లాట్ల పంచాయితీలే జరుగుతున్నాయి. ఇక కొందరు ఆఫీసర్లు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. అయితే ఈ గొడవల్లోకి వారు నేరుగా రాకుండా కొందరు మధ్య వర్తులను ముందుంచి కథ నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక వేళ పంచాయితీ బెడిసి కొట్టి ఏదైనా జరిగితే తమకు ఏమీ తెలియదు అన్నట్టు చెప్పుకునేందుకు పోలీసులు మధ్యవర్తులను ముందుంచుతున్నారని తెలిసింది. ఇక ఈ మధ్య వర్తిత్వం చేసే వారు కొన్ని స్టేషన్లలో రాజకీయ నాయకులైతే.. మరి కొన్ని స్టేషన్లలో ఆయా ప్రాంతాల్లో ప్రతికలు, మీడియాలో పని చేస్తున్న జర్నలిస్టులు ఉండడం గమనార్హం. ఇటీవల ఓ ఠాణాలో జరిగిన ఓ భూ సెటిట్‌మెంట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు జర్నలిస్టులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి అక్కడి పోలీసులతో కలిసి వాటాలు పంచుకున్నట్టు తెలిసింది. ఈ విషయం కాస్తా జర్నలిస్టు వర్గాల్లో బయటకు పొక్కడంతో సదరు అధికారి ప్రధాన మీడియాలో ఉండే మరో నలుగురు జర్నలిస్టులకు విందు ఏర్పాటు చేసి శాంత పర్చినట్టు సమాచారం. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### పోలీసులు జోక్యం చేసుకో వద్దు



సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు. కోర్టు నుంచి సదరు బాధితులకు ఇంజక్షన్ ఆర్డర్, పోలీసు ప్రొటెక్షన్ ఆర్డర్స్ ఉన్న సమయంలో మాత్రమే పోలీసులు రావాలి. అలా కాకుండా పోలీసులు అత్యుత్సాహంతో భూ తగాదాల్లో జోక్యం చేసుకుంటే ఎన్నటికైనా వారికే ముప్పు.

– చల్లా అశోక్‌వర్ధన్ రెడ్డి, అడ్వకేట్



నేరాల నియంత్రణపై

## దృష్టి పెట్టాలి

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

3



అభివృద్ధి పనులు

## స్పీడప్ చేయాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



లంచం ఇస్తేనే

## ఇందిరమ్మ ఇల్లు

- కాంగ్రెస్ లీడర్లపై ఎమ్మెల్యే పల్లా ఫైర్


3



# చివరి గింజ వరకు మద్దతు ధర

- **తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి**
- **హమాలీలు, రవాణా సమస్యలు లేకుండా చూడాలి**
- **వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** యాసంగి సీజన్ లో రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 57 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు జరిగిందని, ప్రభుత్వం దాదాపు 17 వేల కోట్ల ఖర్చు చేస్తూ, 70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తుందని, వీటికి అదనంగా సన్న రకం ధాన్యానికి క్వింటాల్ రూ.500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓపీఎంఎస్‌లో నమోదు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. రానున్న 15 రోజులు ఎంతో కీలకమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లను సరిపడా అందుబాటులో పెట్టుకోవాలన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్లు, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాల్లో అవసరమైతే ఇంటర్మీడియరీ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. జనవరి 26, 2025 తరువాత రాష్ట్రంలో నూతనంగా 1,57,467 రేషన్ కార్డులను పంపిణీ చేశామని, వీటి ద్వారా 16 లక్షల 67 వేల 936 మంది ప్రజలకు అదనంగా రేషన్ అందుతుందని మంత్రి తెలిపారు. మీసేవా కేంద్రాలు, ప్రజా పాలన కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేసి అర్హులకు రేషన్ కార్డులను జారీ చేయాలని మంత్రి వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఎం సీఎస్ హాతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, డీఎంఓ నరేందర్, డీఏఓ రామారావు నాయక్, డీసీఓ రాజేందర్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ మొట్ట మొదటి సారిగా ఏర్పాటు చేసిన సర్వజన మధ్యవర్తిత్వ కేంద్రం(కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ )ను జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ విక్రమ్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ ఆదేశానుసారం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సెంటర్‌ను ఇక్కడి ప్రజలు అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి చిన్న సమస్యకి పోలీస్ స్టేషన్, కోర్టు పరిష్కారం మార్గం కాదని, మీ సమస్యలు మీ ప్రమేయంతో మీ నిర్ణయంతో పరిష్కరించుకోవడానికి ఈ మధ్యవర్తిత్వ కేంద్రం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో రఘునాథపల్లి ఎస్సై డి.నరేష్, మధ్యవర్తులు బి.శంకరయ్య, డి.ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# పాఠ్య పుస్తకాల గోదాం పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాకేంద్రంలోని వీవర్స్ కాలనీలో ఉన్న పాఠ్య పుస్తకాల గోదాంను రాష్ట్ర వయోజన విద్య అదనపు సంచాలకులు జి.ఉషారాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్య పుస్తకాల పంపిణీ, ఇతర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఇప్పటి వరకు జిల్లాకు 82 శాతం పుస్తకాలు చేరుకోగా, జిల్లాలోని 9 మండలాలకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట డీఈవో భోజన్న, ప్లానింగ్ అధికారి తోట రాజు, పాఠ్య పుస్తకాల మేనేజర్ సంపత్, వయోజన విద్య జిల్లా అధికారి విజయ్ కుమార్, కేశవరావు ఉన్నారు.

# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందజేస్తుందని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్ల ప్రవేశానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ తన ఛాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మైనారిటీ పాఠశాలలో పది ఫలితాల్లో 100 శాతం ఫలితాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని మైనార్టీలందరూ నాణ్యమైన విద్య కోసం మైనార్టీ విద్యాసంస్థలల్లో అడ్మిషన్ పొందాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్, మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిల్‌బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.కుమార్ స్వామి, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రిన్సిపాల్ మాధవి లత పాల్గొన్నారు.



## పట్టణ సుందరీకరణ పనుల పర్యవేక్షణ

పట్టణ కేంద్రంలోని హన్మకొండ బై పాస్ రోడ్డులో స్వాగత తోరణం ఏర్పాటు పనులను, అలాగే హైదరాబాద్ రోడ్డు పెంబర్తి బై పాస్ లో జంక్షన్ అభివృద్ధి పనులను, బతుకమ్మ కుంట సుందరీకరణ పనులను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించి, సంబంధిత వివరాలపై ఆరా తీసి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పనులను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువు లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్ ఉన్నారు.



Local News



# లంచం ఇస్తేనే ఇందిరమ్మ ఇల్లు

- ఇది కాంగ్రెస్ నేతల తీరు
- ప్రభుత్వం ప్రజలు మండిపడుతున్నరు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** 'కాంగ్రెస్ ప్రభుత్వం లంచం ఇస్తే పథకాలు అందజేస్తుంది. ఇల్లు కోసం పల్లెల్లో అయితే రూ.50 వేలు, పట్టణాల్లో లక్ష రూపాయలు వసూల్ చేస్తున్నారు..' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. లంచాలతో ప్రభుత్వ పథకాలు అందచేయడం చట్ట విరుద్ధమని, వెంటనే కలెక్టర్ చొరవ తీసుకుని నిబంధనలు ప్రకారం అర్హులకు ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రం సమీపంలో యశ్వంతాపూర్ పార్టీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యతో కలిసి పల్లా విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో 100 నుంచి 300 వరకు ఇండ్లు ఇస్తామని నోటిఫికేషన్ ఇచ్చి సెలెక్ట్ చేస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం కాంగ్రెస్ నాయకులు పల్లెల్లో అయితే రూ. 50 వేలు, పట్టణం అయితే లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారని, వారి బంధువులైనా సరే పైసలు ఎవరు ఇస్తే వారికి ఇండ్లు ఇస్తామని అంటున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం లేదా కలెక్టర్, అధికారులను ఖచ్చితంగా తాము డిమాండ్ చేస్తున్నామని.. ఎవరైతే పేద వారు, అర్హులు ఉంటారో వారికి నిబంధనల ప్రకారం ఇవ్వాలన్నారు.

## రైతుల గోస పట్టదా..!

జిల్లాలో అకాల వర్షాలు, వడగళ్ల వానతో రైతన్నలు కన్నీళ్లు కారుస్తున్నారని, కల్లాల్లో వారి బాధను పట్టించుకునే నాథుడు లేడని, వారి పరిస్థితి ఆరోణ్య రోదన మారిందని పల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జీతాలివ్వలేని పరిస్థితి ఉందని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 'నన్ను కొసగా తింటారా? నా దగ్గర పైసలు లేవు, ఏమైనా చేసుకోండి..' అని ముఖ్యమంత్రి ఉద్యోగులకు, ఉపాధ్యాయులను హెచ్చరించడం ఎంత వరకు సమంజసం అన్నారు. వందల కోట్లతో అందాల బామాలకు మంత్రుల దగ్గర నుంచి పోటీ పడి వెండి పల్లాల్లో కాళ్లను కడిగి వారి నెత్తిలో నీళ్లు చల్లుకొని మన సమ్మక్క సారక్క స్ఫూర్తిని, రాణి రుద్రమదేవి స్ఫూర్తిని దెబ్బ తీశారని మండిపడ్డారు. ఒక చారిత్రాత్మక నగరానికి ఇటువంటి వాళ్లని తీసుకొచ్చిన దురదృష్టమైన దినం అని, తెలంగాణ చరిత్రలో ఇది మరచిపోలేని అవమానం అన్నారు. దేశ రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు రామప్ప దేవాలయం, వేయిస్తంభాల గుడి, యాదగిరిగుట్ట వంటి పుణ్యక్షేత్రాలను గౌరవంగా దర్శించారు.. కానీ ఎవ్వరూ ఇలాంటి పనులు చేయలేదన్నారు. తెలంగాణ మంత్రులు దీన్ని మన సంప్రదాయంగా సమర్థించడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపెల్లి ప్రేమలారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, నాయకులు ఉల్లెంగు సందీప్, సేవెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** ముస్లిం మైనార్టీలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ అన్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని జామియా మసీదులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో ఉచితమైన నాణ్య విద్యతో పాటు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ , పౌష్టికాహారం వసతి అందజేస్తుందన్నారు. జిల్లాలోని ముస్లింలు తమ పిల్లలకు మైనార్టీ విద్యాసంస్థల్లో అడ్మిషన్ పొందాలని అన్నారు. ఈ విషయంలో మైనార్టీ మతపెద్దలు, నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ పి.అనిల్ బాబు, స్కూల్ ప్రిన్సిపాల్ కె.కుమారస్వామి, అధ్యాపకులు సల్మాన్, సిబ్బంది సిద్ధులు, ఫసీ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఐపై కార్యదర్శులకు శిక్షణ

**జనగామ, మన చౌరాస్తా :** ఆర్‌టీఐ, గ్రామసభలపై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ భాగస్వామ్యంతో జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణకు 35 మంది కార్యదర్శులు హాజరయ్యారు. మొదటి రోజు భాగంగా గ్రామ పంచాయతీ స్థాయిలో పారదర్శకతను ప్రోత్సహించడం, సమాచార హక్కు చట్టం 2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, గ్రామసభ సమాచార హక్కు వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీవో స్వరూప, ఎస్‌బీఎం డీసీ కర్ణాకర్, ఎంపీవో ప్రకాశ్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# వెస్ట్ జోన్ పీఎస్‌లను సందర్శించిన సీపీ

**జనగామ, మన చౌరాస్తా :**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్, తరిగొప్పుల, నర్మెట్ట, జనగామ పోలీస్ స్టేషన్లతో పాటు వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు ఉన్నాయి, సెక్టార్ వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలన్నారు. ట్రైసిటీ పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి



క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకు నిరంతరం పనిచేయాలన్నారు. నేరాల నియంత్రణకు విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకోసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## సమావేశ ప్రాంగణం ప్రారంభం

జనగామ ఏసీపీ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన వెస్ట్ పోలీస్ అధికారుల సమావేశ ప్రాంగణాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్



సింగ్ ప్రారంభించారు. అనంతరం ఈ సమావేశ ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ పండ్ల మొక్కలను నాటారు. ఆయన వెంట డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఏఎస్పీ చైతన్ నితిన్, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.



# సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు దోహదం

## ■ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట వద్ద నిర్వహిస్తున్న నెట్ బాల్ స్టేట్ లెవల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్- 2025 క్రీడలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టోర్నమెంట్‌కు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. క్రీడలు యువతకు దిశానిర్దేశకంగా నిలవాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జనగామ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యావద్, ఆర్‌టీఏ జిల్లా మెంబర్ అభిగౌడ్, మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్, డాక్టర్ సుగుణాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాగపూరిలో బడిబాట




**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలంలోని నాగపురి గ్రామంలో శుక్రవారం రోజున విద్యా సంబంధమైన బహుళ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే ఐలయ్య ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పిన్నింటి మల్లికార్జున్ రెడ్డి, రామాంజనేయుల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్, ఉల్లాస్, హ్యాపీ ప్లే స్కూల్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అనేక సౌకర్యాలు వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలే గుడులని, బాలలే దేవుళ్ళని పాఠ్యపుస్తకాలే పవిత్ర గ్రంథాలని, పాఠశాల మరో భవిష్యత్తు ప్రపంచమని అందుకే ప్రభుత్వ పాఠశాలలకే గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో బోధన సిబ్బంది ఎస్. నిరూపమ, అందే విజయ్ కుమార్ , గొట్టం ప్రకాశ్ రెడ్డి కర్రోల్ల స్వర్ణ కుమార్, పి.రాజేశ్వరి, ఎస్.కనక లింగం, బోపూరి బాల్ రెడ్డి, బొల్లం సంపత్, స్వామి పాల్గొన్నారు. అంతేకాకుండా మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు ఉల్లంపల్లి కరుణాకర్, మాజీ సర్పంచ్ బండ కింది కర్ణాకర్, నల్ల పోచమ్మ దేవస్థానం చైర్మన్ గూడెం మహేష్, ఎస్ఎంసి మాజీ చైర్మన్లు ప్రజ్ఞాపురం నరసింహులు, మోకు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుందారపు రాములు, పంచాయతీ కార్యదర్శి ఏలూరు రాజు, కారోబార్ తుమ్మ మనోజ్ కుమార్, వీవో మంతపురి జ్యోతి, ఏపిపిసి చైర్ పర్సన్స్ సభ్యులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

## ■ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. జిల్లాలోని గానుగుపహాడ్, అడవికేశ్వాపూర్ పంచాయతీల పరిధిలో పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, కాంటా కోసం బస్తాలలో ధాన్యాన్ని నింపుతున్న తీరును, ధాన్యం కొనుగోలు రిజిస్టర్లను తనిఖీ చేసి, ఓపీఎంఎస్ లో నమోదు చేసే రైతుల ధాన్యం కొనుగోళ్ల వివరాల గురించి కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎప్పటికప్పుడు కొనుగోళ్ల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, వాటిని సరైన విధంగా నిర్వహించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. అదే విధంగా ధాన్యాన్ని కేంద్రంలో ఎక్కువ రోజుల వరకు నిల్వ చేయకుండా, తేమ శాతం రాగానే తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సజావుగా నిర్వహించాలని, ధాన్యం కొనుగోళ్లలో అవకతవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని,



కాంటాలో తేడాలు రావొద్దని, ఎటువంటి అలసత్వం వహించరాదని, తాడిపత్రిలు, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట డీఎం సీఎస్ హతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, డీసీఓ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ హుస్సేన్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# చేర్యాల అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం

## ■ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్




**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల ప్రాంత అభివృద్ధికి, చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం సీపీఐ రాజులేని పోరాటం నిర్వహిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. సీపీఐ వీరన్నపేట గ్రామ శాఖ 2వ మహాసభ సందర్భంగా శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సీపీఐ జెండాను పొన్నబోయిన శ్రీనివాస్ ఎగురవేశారు. అనంతరం సీనియర్ నాయకుడు దండబోయిన వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ.. చేర్యాల ఒకప్పుడు నియోజకవర్గంగా, తాలూకా కేంద్రంగా ఉండి నేడు అస్తిత్వాన్ని కోల్పోయిందని, అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత పది సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈప్రాంతాన్ని పట్టించుకోలేదని అన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించి చేర్యాల ప్రజల చిరకాల కోరికను నెరవేర్చాలని కోరారు. చుంచనకోట వయా వీరన్నపేట మీదుగా జనగామ రాజీవ్ రహదారి వరకు బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని, చేర్యాలలో సమీకృత భవనాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని పలు సమస్యలపై ఈ సభలో తీర్మానం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకలైన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాస పథకాలను నిరుపేదలను గుర్తించి పారదర్శకంగా ఫలాలు అందించాలని కోరారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల నాయకులు నంగి కనకయ్య, పొన్నబోయిన మహేందర్, నంగి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా పొన్నబోయిన శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా చిగుళ్ల నరేష్, బింగి లింగం, కోశాధికారిగా చిగుళ్ల నాగరాజు, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పిల్లికండ్ల నర్సింహులు, కార్యవర్గ సభ్యులుగా పోకల కనకయ్య, జూకంటి చంద్రం, చింతల నకులుడు, సిద్ధిరాం భద్రయ్య, కుక్కల ప్రశాంత్, కౌన్సిల్ సభ్యులుగా పబ్బల్ల నరేష్, పొన్నబోయిన మహంకాళీ, దండబోయిన కనకయ్య, చిగుల్ల శ్రీశైలం, పొన్నబోయిన ప్రభాకర్, పొన్నబోయిన నాగార్జున లు ఎన్నికయ్యారు.

wanted
విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way